క్లుప్తంగా

జేవీవీ అవగాహన సదస్సు



కావలి: పట్టణంలోని రత్నం పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థుల వికాసంపై మీడియా ప్రభావం, భావిపౌరుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే అంశాలు, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల బాధ్యత, తదితర అంశాలపై విశ్రాంత హెచ్‌ఎం శారద, వక్తలు కల్లయ్య , జానకిరామ్, హరినారపరెడ్డి అవగాహన కల్పించారు. కౌమారదశలో విద్యార్థులు విద్యతోపాటు వినయం, వివేకం, సంపూర్ణ వికాసం పొందాలన్నారు. తరగతి పుస్తకాలపై మాత్రమే ఆధారపడక , గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానాన్ని ఆర్జించాలన్నారు. సమాజంలో వస్తున్న మార్పులు, పరిస్థితులను తెలుసుకుంటూ భావిభారత ఉత్తమపౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. జేవీవీ అధ్యక్ష,కార్యదర్శులు తోట వెంకటేశ్వర్లు, గాదంశెట్టి హరనాథ్, కోశాధికారి సుబ్బరాయశర్మ, రత్నం హైస్కూల్ హెచ్‌ఎం సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు, కలిగిరిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం ప్రారంభించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రఘు, యన్నం రామచంద్రారెడ్డి, వనిపెంట సుబ్బారెడ్డి, జూపల్లి రాజా, గూడ నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధోత్సవం

మర్రిపాడు: స్థానిక బాలుపల్లి గుంతపాళెంలో ముస్లిం యూత్ ఆధ్వర్యంలో మహబూబ్ సుభాని గంధోత్సవాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తొలుత గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిపి గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

గిరిజనులకు పట్టల పంపిణీ



కలిగిరి: కలిగిరి పంచాయతీ పరిధిలోని పాపన మునిలిపాళెం, వెంకన్నపాళెం గ్రామాల్లోని గిరిజన కుటుంబాలకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శనివారం టార్పాలిన్ పట్టలను పంపిణీ చేశారు. కలిగిరి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు శానిటేషన్ కిట్లు అందజేశారు. రెడ్‌క్రాస్ కావలి శాఖ చైర్మన్ డీ రవిప్రకాష్, కలిగిరి శాఖ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులురెడ్డి, ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

ఆశీర్వచనం

జలదంకి: హనుమకొండపాళెంలో శనివారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సానా బాలకృష్ణ కుమార్తె జ్యోత్స్న నలుగు కార్యక్రమానికి ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. వధువును ఆశీర్వదించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, నాయకులు ఉన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ఏర్పాట్లపై సమీక్ష



సోమశిల: అనంతసాగరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ ఓ ఆనంద్ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయంలో మండలాధికారులతో ప్రజాసమస్యల పరిష్కార వేదిక ఏర్పాట్లపై ఆత్మకూరు ఆర్డీఓ పావని శనివారం సమీక్షించారు. మండలాధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సుధీర్, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

కావలి: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కావలి రెండో పట్టణ ఎస్సై షేక్ గౌస్‌బాషా తెలిపారు. వివరాలు..పట్టణంలోని వైకుంఠపురం ప్రాంతానికి చెందిన ఉప్పు అన్నపూర్ణ (35) చీటీలు కట్టి నగదు పాడుకుని అందులో కొంత వడ్డీకి ఇచ్చింది. మరికొంత సొంతానికి వాడుకుంది. అయితే వడ్డీకి నగదు తీసుకున్న వారు ఆమెకు తిరిగి చెల్లించలేదు. దీంతో చీటీలకు కట్టాల్సిన నగదు చెల్లించలేకపోయింది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న అన్నపూర్ణ ఈ నెల 21న ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన భర్త, సోదరుడు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన ముఖద్వారం



పూర్వవిద్యార్థి నిర్మించిన స్టేజ్

చేయిచేయి కలిపి భవితకు బాటలు

వారంతా పూర్వవిద్యార్థులు. చిన్నప్పుడు పాఠశాలలో అరకొర వసతుల నడుమ కష్టపడి చదువుకున్నారు. ఆ సమయంలో తాము పడిన ఇబ్బందులు నేటి తరం పడకూడదని భావించారు. తమకు ఓనమాలు నేర్పిన పాఠశాల అభివృద్ధికి చేతనైనంత సాయం చేయాలని సంకల్పించారు. పూర్వ విద్యార్థుల సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి పాఠశాల అభివృద్ధికి పాటు పడుతున్నారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేస్తూ వారి భవితకు బాటలు వేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు జలదంకి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



- ఓనమాలు నేర్పిన పాఠశాల అభివృద్ధికి సహకారం
- విద్యార్థులకు ప్రోత్సాహకాల అందజేత
- ఆదర్శంగా నిలుస్తున్న జలదంకి ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు



రూ.5 లక్షల చెక్కును హెచ్‌ఎంకు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు (ఫైల్)

జలదంకి:. జలదంకి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి వివిధ రంగాల్లో ఉన్నత స్థితికి చేరిన పూర్వ విద్యార్థులు తమకు ఓనమాలు నేర్పిన పాఠశాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో చేయిచేయి కలిపారు. అనుకున్నదే తడవుగా సమావేశమై పాఠశాలకు కావాల్సిన వసతులను సమకూర్చాలని నిర్ణయించుకుని పూర్వ విద్యార్థుల సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడిగా నెల్లూరులోని జగన్ విద్యా సంస్థల అధినేత ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా మద్దుల వెంకటనరసింహం, అధ్యక్షుడిగా కోర్పిపాటి హరినారపరెడ్డి, జాయింట్ సెక్రటరీగా సురె లక్ష్మిరెడ్డి, ట్రెజరర్‌గా సురె వెంకటశేషారెడ్డిను ఎన్నుకున్నారు. అనంతరం పూర్వవిద్యార్థులను సంఘంలో చేర్చుకుంటూ వారి సహాయ సహకారాలతో పదేళ్లగా పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారు. ఏటా విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేస్తూ ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఏటా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది.

సంఘం చేపట్టిన కార్యక్రమాలు

- పాఠశాల ప్రధాన గేట్లను పూర్వ విద్యార్థులు ఇస్కా రంగారెడ్డి, బ్రహ్మారెడ్డి సమకూర్చారు.
- పాఠశాల ముఖద్వారాన్ని హరినారపరెడ్డి నిర్మించారు.
- స్టేజీని రూ.3లక్షలతో పూర్వవిద్యార్థి మద్దుల వెంకటనరసింహం నిర్మించారు.
- సైన్స్‌ల్యాబ్, మినరల్ వాటర్ ప్లాంట ఏర్పాటు
- పాఠశాల ప్రాంగణంలో రాత్రివేళల్లో ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు వాచ్‌మెన్‌ను నియమించారు.
- క్రీడామైదానాన్ని క్రీడలకు అనుకూలంగా చదును చేయించారు.
- పాఠశాల చుట్టూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి.
- ఏటా వార్షిక వేడుకల నిర్వహణ.
- రిపబ్లిక్‌డే వేడుకల్లో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల ప్రదానం.
- పాఠశాల పేరుపై రూ.5 లక్షల చెక్కు డిపాజిట్. దానిపై వచ్చే వడ్డీతో ఏటా పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతుల అందజేత.

పూర్వవిద్యార్థులకు ఆహ్వానం



పాఠశాలలో చదివిన ఎవరైనా సంఘంలో చేరేందుకు ముందుకొస్తే చేర్చుకుంటాం. విద్యార్థులకు సేవ చేయాలనే సంకల్పం ఉన్న ప్రతిఒక్కరూ తమ సంఘంలో చేరి విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేయవచ్చు.

– మద్దుల వెంకట నరసింహం, గౌరవాధ్యక్షుడు, పూర్వ విద్యార్థుల సంఘం

మా ఉన్నతికి స్కూలే కారణం



మేం ఈ రోజు ఉన్నత స్థాయిలో ఉన్నామంటే అందుకు ఉన్నత పాఠశాలే కారణం. అక్కడ నేర్చుకున్న చదువే మా ఉన్నతికి దోహదపడింది. చిన్నతనంలో పాఠశాలలో మేము పడ్డ కష్టాలు ఈ తరం చిన్నారులు పడకూడదని వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం.

– కే హరినారపరెడ్డి,అధ్యక్షుడు, పూర్వవిద్యార్థుల సంఘం

విద్యార్థుల ఉన్నతే లక్ష్యం



విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలబెట్టాలనే సంకల్పంతో పూర్వ విద్యార్థులందరం కలిసి సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నాం. పాఠశాలలో చదివిన వారు ఎవరైనా సంఘంలో చేరి సేవ చేయాలనుకుంటే ఆహ్వానిస్తున్నాం.

– సురె లక్ష్మిరెడ్డి, జాయింట్ సెక్రటరీ, పూర్వ విద్యార్థుల సంఘం

విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే



మేము చిన్నతనంలో చదువుకునేందుకు వసతులు లేక ఇబ్బందులు పడ్డాం. నేటి తరం పిల్లలు తమలా పడకూడదని తాము చదివిన పాఠశాలను అభివృద్ధి చేయాలనుకున్నాం. అనుకున్నదే తడవుగా సంఘాన్ని ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

– సురె వెంకటశేషారెడ్డి, ట్రెజరర్, పూర్వ విద్యార్థుల సంఘం

బాలికల వసతిగృహాలను తనిఖీ చేసిన జడ్జి



సరుకులను పరిశీలిస్తున్న జడ్జి శోభ

కావలి: రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు కావలి సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ కావలిలోని బాలికల వసతిగృహాలను శనివారం తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందజేస్తున్న ఆహారం నాణ్యతతో పాటు మౌలిక వసతుల కల్పనను పరిశీలించారు. విద్యార్థినులకు ఆహారం, విద్య అందించే విషయంలో నిర్లక్ష్యం వహించరాదని వసతిగృహాల నిర్వాహకులకు సూచించారు. విద్యార్థినులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. న్యాయమూర్తి వెంట లీగల్ ఎయిడ్ సభ్యులు సాయిప్రసాద్, తదితరులు ఉన్నారు.

కావలి మున్సిపాలిటీకి పురస్కారం

కావలి: ఆత్మ నిర్భర నిధి పథకం అమల్లో ప్రతిభ కనబరిచినందుకు కావలి మున్సిపాలిటీకి పురస్కారం లభించిందని కమిషనర్ శ్రావణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఆత్మనిర్భర పథకం కింద పట్టణంలోని 3,467 మంది తోపుడు బండ్ల వ్యాపారులకు రూ.10వేలు చొప్పున రుణాలు మంజూరు చేసినట్లు ఆయన చెప్పారు. రుణాలను చెల్లించడంలో నిబంధనలు పాటించిన 1,154 మందికి రూ.20వేలు, మరో 145 మందికి రూ.30వేలు చొప్పున తిరిగి అందజేశామని వివరించారు. పథకం అమల్లో చక్కటి పనితీరును కనబరిచిన రాష్ట్రంలోని పదిహేను మున్సిపాలిటీలకు అవార్డులు ప్రకటించగా, అందులో కావలి కూడా ఉందని చెప్పారు. ఈ నెల 29న విజయవాడలో అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

6న పాతాళపల్లి చెరువు చేపల వేలం

సోమశిల: అనంతసాగరం మండలం పాతాలపల్లి చెరువు చేపల వేలం పాటను నవంబర్ 6న నిర్వహించనున్నట్లు సర్పంచ్ బిజివేముల ఓబుల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంజనేయులు శనివారం తెలిపారు. గ్రామ సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు వేలం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ముందస్తుగా రూ.10వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ శిరీష



వరికుంటపాడు: మాట్లాడుతున్న ఎంపీపీ

కలిగిరి: గ్రామాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎంపీపీ మెట్టుకూరు శిరీష పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఉన్నందున వైద్య, పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి రబీ పంటల సాగులో తగిన సూచనలు, సలహాలు అందజేయాలన్నారు. ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. శిథిలావస్థకు చేరిన ఎంపీడీఓ కార్యాలయం స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించాలని తీర్మానించారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జీ వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. మండలంలో 9 మంది ఎంపీటీసీలు గాను ముగ్గురు, 24మంది సర్పంచ్‌లకు గాను ముగ్గురు హాజరయ్యారు. అన్ని శాఖల మండలాధికారులు హాజరు కావల్సి ఉండగా వారు కూడా నామమాత్రంగా హాజరయ్యారు. దీంతో సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. ఎంపీపీ వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. జెడ్పీటీసీ ఆర్ నాగేంద్ర మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి కూడా అన్ని శాఖల అధికారులు హాజరుకాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం హాజరైన అధికారులు శాఖల వారీగా నివేదికలు చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వేణుగోపాల్‌రావు, వైస్‌ఎంపీపీ చంచల మధు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముందర పొట్టెమ్మ తిరునాళ్ల ప్రారంభం

కావలి: మండలంలోని అన్నగారిపాళెంలో కొలువైన ముందర పొట్టెమ్మ తిరునాళ్ల శనివారం ప్రారంభమంది. మూడ్రోజుల పాటు జరిగే తిరునాళ్లలో భాగంగా తొలిరోజు ముందర పొట్టెమ్మతో పాటు గంగమ్మకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం పూలంగిసేవ జరిపారు. అమ్మవార్లు విశేషాలంకారాల్లో దర్శనమిచ్చారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కావలి, బోగోలు, అల్లూరు మండలాలకు చెందిన భక్తులు పెదఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.





విశేషాలంకారంలో ముందర పొట్టెమ్మ, గంగమ్మ

ఉపాధి ఏపీఓ,కంప్యూటర్ ఆపరేటర్లకు తాఖీదులు

సోమశిల: అనంతసాగరం మండల ఉపాధి ఏపీఓ దయాసాగర్, కంప్యూటర్ ఆపరేటర్ జమీర్‌కు విజిలెన్స్ అధికారులు శనివారం తాఖీదులు ఇచ్చారు. బొమ్మవరంలో ఉపాధి హామీ పనుల నిర్వహణలో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో తాఖీదులు అందజేశారు. వారం రోజుల్లో ఉన్నతాధికారులకు నివేదిక అందించకుంటే ఏపీఓపై పూర్తి స్థాయిలో సస్పెన్షన్ వేటు పడే అవకాశం ఉంది.

పోలీసు వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలి



సంగం : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



ఏఎస్‌పేట పోలీసుస్టేషన్‌లో..

అనుమసముద్రంపేట: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎస్సై సైదులు ఆధ్వర్యంలో విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో ఉండే రిసెప్షన్ వ్యవస్థ, కేసు డైరీలు, పోలీసుల విధులు, వారు ఉపయోగించే ఆయుధాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే పోలీస్ వ్యవస్థ పనితీరుపై అవగాహన కలిగి ఉండాలని, శాంతిభద్రతల పరిరక్షణకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్సై సూచించారు.

సంగం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పాఠశాల విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ పని తీరు, విధుల్లో పోలీసులు ఉపయోగించే పరికరాలు, యంత్రాలు, బ్రీత్‌ఎనలైజర్స్ తదితర వాటిపై అవగాహన కల్పించారు.

క్షయరహిత సమాజాన్ని నిర్మిద్దాం


కావలి: క్షయ రహిత సమాజ నిర్మాణానికి వైద్యసిబ్బందికి ప్రజలు సహకరించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పీ బ్రిజిత కోరారు. శనివారం ఆమె కావలిలో మాట్లాడారు. క్షయ రహిత సమాజ నిర్మాణానికి వైద్యారోగ్య సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. క్షయపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండు వారాలు మించి జ్వరం, దగ్గు ఉన్నవారు తప్పనిసరిగా సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించి గళ్ల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు చొరవచూపి పరిశ్రమల పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే, వసతి గృహ విద్యార్థులకు గళ్ల పరీక్షలు చేయాలని కోరారు.

మాలల గర్జన జయప్రదానికి పిలుపు



అల్లూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 4న అల్లూరులో చేపడుతున్న మాలల గర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్రాధ్యక్షుడు ఎల్లు సాల్మాన్‌రాజు పిలుపునిచ్చారు. ఇస్కపల్లి పంచాయతీలో శనివారం ఆయన పర్యటించారు. ఎస్సీ వర్గీకరణపై మాలలను చైతన్యపరిచారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా మాలమాదిగల నడుమ చిచ్చుపెట్టి అట్రాసిటీ యాక్ట్‌ను నిర్వీర్యం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని గమనించి మాలలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. నాయకులు కే సింహాద్రి, పీ సుధాకర్, డీ మాల్యాద్రి, ఎం నరేంద్ర, జీ సతీష్, కమలాకర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



జలదంకి: భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కావలి ఆర్డీఓ వంశీకృష్ణ తెలిపారు. మండలంలోని తిమ్మసముద్రంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్డీఓ మాట్లాడారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అభ్యంతరాలను స్వీకరిస్తున్నామని తెలిపారు. రైతులు అర్జీల రూపంలో సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీటీ జాలీభాయ్, రీసర్వే డీటీ శ్యాంసన్, సర్వేయర్ శోభన్‌బాబు, సర్పంచ్ రావి ప్రసాద్‌నాయుడు, వీఆర్వో గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

కావలి: కార్తీక మాసం సందర్భంగా కావలి ఆర్టీసీ డిపో నుంచి శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు శనివారం తెలిపారు. శైవక్షేత్రాలను సందర్శించాలనుకునే భక్తుల కోసం శ్రీశైలం, అరుణాచలం, పంచారామ క్షేత్రాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, సామర్లకోట, ద్రాక్షారామానికి ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని చెప్పారు. వాటికి ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. వివరాలకు ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ లేదా సూపరింటెండెంట్లను 99660 09395, 94939 13989 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆత్మకూరురూరల్: కార్తీక మాసంలో పంచారామ క్షేత్రాలను దర్శించుకునే భక్తుల కోసం ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కరీమున్నీసా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 3, 10, 17, 24 తేదీల్లో రాత్రి 8 గంటలకు ఆత్మకూరు డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. ఒక్కరికి రానుపోను టిక్కెట్ ధర రూ.2700గా నిర్ణయించామన్నారు. తమిళనాడులోని అరుణాచలం క్షేత్రాన్ని దర్శించుకునే భక్తుల కోసం సూపర్‌లగ్జరీ బస్సు నడుపుతున్నామన్నారు. ఒక్కరికి రానుపోను టిక్కెట్ ధర రూ.1400గా నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఆత్మకూరు డిపో మేనేజర్ 99592 25645, అసిస్టెంట్ మేనేజర్ 73829 24753 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మోడల్ స్కూల్‌కు బస్సును పునరుద్ధరించాలని వినతి



ట్రాఫిక్ కంట్రోలర్‌కు అర్జీ అందజేస్తున్న దృశ్యం

కావలి: మండలంలోని అన్నగారిపాళెం పంచాయతీ పరిధిలోని ఒట్టూరులో ఉన్న మోడల్ స్కూల్‌కు బస్సును పునరుద్ధరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు కావలి ఆర్టీసీ డిపో మేనేజర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ట్రాఫిక్ కంట్రోలర్ రామకృష్ణను కలిసి సమస్యను విన్నవించారు. తుమ్మలపెంట రోడ్డు నిర్మాణంతో గత పదిహేను రోజులుగా బస్సు సర్వీసును నిలిపివేయడం వల్ల విద్యార్థులు ఆటోల్లో వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. బస్‌పాస్‌లు ఉన్నా ఆటోలో వెళ్లాల్సి రావడంతో చార్జీలు భారంగా మారాయన్నారు. విద్యార్థులు ఆటోల్లో కిక్కిరిసి వెళ్లాల్సి వస్తోందని, ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో తుమ్మలపెంట రోడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు మోడల్ స్కూల్‌కు మరో మార్గంలో బస్సును నడిపి విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చూడాలని కోరారు. కరవది భాస్కర్, ఎస్కే ఖాదర్‌బాషా, సీహెచ్ ప్రవీణ్, టీ రవి, వీ నరసింహారావు, ఎస్కే నాయబ్, ఎన్ చంద్ర, ఎస్ కే మజహర్, జంపాని శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘ ఎన్నికలకు సంసిద్ధం

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆత్మకూరు డివిజన్ పరిధిలో సాగునీటి సంఘ ఎన్నికలకు సంసిద్ధమవుతున్నట్లు ఆత్మకూరు ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రేవూరు వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని 95 సాగునీటి సంఘాలకు సంబంధించి తహసీల్దార్ల సహకారంతో ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రాదేశిక నియోజకవర్గం (టీసీ) సభ్యులు సంఘ అధ్యక్షుడిని ఎన్నుకుంటారని, సంఘ అధ్యక్షుడుగా పోటీ చేసే వ్యక్తి తప్పనిసరిగా టీసీ మెంబర్ అయిఉండాలని తెలిపారు. నవంబరు 20, 21, 22 తేదీల్లో సాగునీటి సంఘ ఎన్నికలను తహసీల్దార్లు, కోఆపరేటివ్ శాఖ అధికారుల సహకారంతో నిర్వహించనున్నట్లు వివరించారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ప్రభుత్వానికి సంబంధించి అన్ని రకాల పన్నులు చెల్లించి ఉండాలని, లేకపోతే అనర్హులవుతారని తెలిపారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలో సాగునీటి కాలువల్లో పూడికతీతకు రూ.4.52 కోట్లతో ప్రతిపాదనలను పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులో కారు అపహరణ

–తీసుకెళ్లే క్రమంలో ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తికి గాయాలు



కారును పక్కకు తొలగిస్తున్న దృశ్యం

చేజర్ల: మద్యం మత్తులో ఓ వ్యక్తి కారును అపహరించాడు. దాన్ని తీసుకెళ్లే క్రమంలో ట్రాక్టర్‌ను ఢీకొని గాయపడ్డాడు. ఈ ఘటన చేజర్ల మండలంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని గొల్లపల్లికి చెందిన చినహజరత్తయ్య వ్యక్తిగత పని నిమిత్తం కారులో సాయంత్రం చేజర్లకు వచ్చాడు. బస్టాండ్ సెంటర్‌లో కారును పార్కింగ్ చేశాడు. మరిచిపోయి తాళాలను కారుకే వదిలేశాడు. ఈ క్రమంలో మద్యంమత్తులో ఉన్న జీ శ్రీకాంత్ అనే వ్యక్తి కారును అపహరించాడు. అనంతరం ఆదూరుపల్లి వైపు వెళ్తూ చిత్తలూరు సమీపంలోని గొల్లరెడ్డిగుంట వాగు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కారు దెబ్బతినగా శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కారును అపహరించడం గమనించిన యజమాని స్నేహితుల సాయంతో వెంబడించారు. కారు ప్రమాదానికి గురైనట్లుగా గుర్తించారు. కాగా ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.